క్లుప్తంగా

సెల్‌ఫోన్లు అప్పగింత



బాధితులకు ఫోన్లు అందిస్తున్న సీఐ

కాగజ్‌నగర్‌టౌన్: పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వేర్వేరు చోట్ల సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న ముగ్గురు బాధితుల సెల్‌ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానంతో గుర్తించి బుధవారం బాధితులకు అప్పగించినట్లు పట్టణ సీఐ బుద్దే స్వామి తెలిపారు. శ్రవణ్, పర్హానా, పర్జానాలు గతంలో ఫోన్ పోయినట్లు ఫిర్యాదు చేయగా, గుర్తించి వారికి అందజేసినట్లు పేర్కొన్నారు. ఎస్సై డొలకాశి చంద్రశేఖర్, పిసి నవీన్ తదితరులు ఉన్నారు.

'ఇంటింటికీ సీపీఐ' విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

రెబ్బెన: ఇంటింటికీ సీపీఐ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ మండల కార్యదర్శి దుర్గం రవీందర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎస్.తిరుపతి కోరారు. బుధవారం రాత్రి గోలేటి టౌన్‌షిప్‌లోని కేఎల్ మహేంద్రభవన్‌లో ఇంటింటికీ సీపీఐ కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు బోగే ఉపేందర్, మండల సహాయ కార్యదర్శి జగ్గయ్య, పట్టణ కార్యదర్శి శ్రీనివాస్, కోశాధికారి రవికుమార్, నాయకులు శేషు, బాలునాయక్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నీటి సరఫరాను పరిశీలించిన ఈఈ

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని రాస్పెల్లి పంచాయతీ పరిధిలో మంచినీటి సరఫరాపై బుధవారం మిషన్ భగీరథ ఈఈ నాగేశ్వర్ రావు సమీక్షించారు. పంచాయతీ పరిధిలోని పెద్దవాడ, మన్నెగూడ, మామిడిగూడ, గెర్రెగూడ, బారెగూడ గ్రామాల్లో నీటి ట్యాంకులను పరిశీలించి ఏవిధంగా నీరు సరఫరా అవుతుందో గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ఎండాకాలంలో నీటి ఎద్దడి ఎదురుకాకుండా ఉండేందుకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డీఈఈ పృథ్వీరాజ్, ఏఈ గోపిచంద్, ఇంట్రా డీఈ సిద్దిక్, బీఆర్‌ఎస్ నాయకుడు బొమ్మెల్ల కిషన్ పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న డీఆర్‌డీవో సురేందర్

ఆసిఫాబాద్: తేనెటీగల దాడిలో గాయపడి జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న కొటగూడకు చెందిన ఉపాధి కూలీలను డీఆర్‌డీవో సురేందర్ బుధవారం పరామర్శించారు. ఆయన వెంట ఎంపీడీవో శశికళ, ఎంపీవో ప్రసాద్ ఉన్నారు.

బీమా పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బ్యాంకు అధికారులు

కౌటాల: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కౌటాల టీజీబీ మేనేజర్ నరసింహస్వామి కోరారు. కౌటాల టీజీబీ ఆధ్వర్యంలో గుడ్లబోరి గ్రామంలో ప్రజలకు బుధవారం వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. ప్రధాన మంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన గురించి తెలియజేశారు. సర్పంచ్ పాలే రాందాస్, ఎంపీటీసీ సభ్యుడు ధనుర్‌కార్ వసంత్ రావ్, నాయకులు రామ్‌కుమార్, విశ్వనాథ్, బాజీరావ్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.

శంఖరావ సదస్సు విజయవంతం చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: హైదరాబాద్‌లో బీఎంఆర్ సార్థ కన్వెక్షన్ హాల్‌లో ఈనెల 22న నిర్వహించే బహుజన ఉద్యోగ ఉద్యమ శంఖారావ సదస్సును విజయవంతం చేయాలని నాయకుడు మేడి చరణ్ దాస్ కోరారు. బుధవారం స్థానిక దీక్ష భూమి వద్ద సదస్సుకు సంబంధించిన పోస్టర్లను ఆయన ఉద్యోగులు, ఉపాధ్యాయులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సదస్సుకు ఉద్యోగులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

అమ్ముదామంటే ధర లేదాయె

- ఇళ్లలో పత్తి నిల్వ చేసుకుంటున్న రైతులు
- రూ.10 వేలు వస్తుందని ఆశ
- చెడిపోతున్న పత్తి నిల్వలు
- తక్కువ ధరకు పంట విక్రయాలు
- నష్టపోతున్న అన్నదాతలు



దహెగాంలోని ఓ రైతు ఇంట్లో నిల్వ చేసిన పత్తి

దహెగాం: వానాకాలం సీజన్ ముగిసి యాసంగి వచ్చింది. ఈ సీజన్ ముగిసి వానాకాలం సీజన్‌కు మరో రెండు నెలల సమయం ఉంది. అయినా చేన్లలో తీసిన పత్తికి గిట్టుబాటు ధర లేక రైతులు ఇళ్లలోనే నిల్వ చేసుకున్నారు. గతేడాది క్వింటాల్‌కు రూ.10 వేలు పలకడంతో ఈసారి కూడా ధర వస్తుందని ఆశతో ఇళ్లలో భారీగా పత్తి నిల్వలు చేసుకున్నారు. ఇవి పేరుకుపోయి చెడిపోతున్నాయి. ఓ వైపు ధర లేకపోవడం, మరోవైపు పత్తి చెడిపోతుండడంతో గత్యంతరం లేక అమ్ముకోవాల్సిన పరిస్థితి. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.

27 వేల ఎకరాల్లో పత్తి సాగు..

మండల వ్యాప్తంగా వానాకాలం సీజన్‌లో సుమారు 27 వేల ఎకరాల్లో పత్తి సాగైంది. సీజన్ ఆరంభ సమయంలో వర్షాలు సమృద్ధిగా కురవడంతో విత్తిన విత్తనాలు మొలకెత్తాయి. జూలైలో భారీ వర్షాలతో పెద్దవాగు, ప్రాణహితకు వరద పోటెత్తడంతో పంట పొలాలను ముంచెత్తాయి. పెద్దవాగు, ప్రాణహిత పరీవాహక ప్రాంతాల్లో సాగవుతున్న పంటలు నీట మునిగి సుమారు 10 వేల ఎకరాలకు తీవ్ర నష్టం వాటిల్లింది. దీంతో మరోసారి పత్తిని విత్తుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అయినా పత్తి తీత పనులు నవంబర్, డిసెంబర్‌లో ప్రారంభించారు. ఆ సమయంలో వర్షాలు కురవడంతో రైతులు నష్టపోయారు.

ధర వస్తుందని ఆశతో..

మొదట్లో తీసిన పత్తికి గిట్టుబాటు ధర రూ.9 వేలు కాగా, గతేడాది రూ.10 వేలకు పైగా ధర పలకడంతో ఈసారి అదే ధర వస్తుందని ఆశతో రైతులు ఇళ్లలో నిల్వ చేసుకున్నారు. ఆరు నెలలుగా గిట్టుబాటు ధర క్రమంగా పెరుగకుండా దిగుతూ రావడంతో ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్‌లో పత్తికి ధర పెరుగక, సాగుకు చేసిన అప్పులు తీర్చే మార్గం లేక తక్కువ ధరకు విక్రయిస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 9 వేల ధర ఉన్నప్పుడు అమ్ముకోలేదని, ప్రస్తుతం రూ.7,650 క్వింటాల్‌కు విక్రయించాల్సి వస్తోందని వాపోతున్నారు.

బరువు తగ్గుతున్న పత్తి

వానాకాలం సీజన్‌లో తీసిన పత్తికి ధర లేకపోవడంతో రైతులు ఇళ్లలో నిల్వ చేసుకున్నారు. రోజు రోజుకు పత్తి బరువు తగ్గడంతోపాటు ఎలుకలు, చెదల వల్ల చెడిపోతుందని వాపోతున్నారు. ధర రాక పోగా నిల్వ చేయడంతో నష్టపోతున్నామని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పత్తికి రూ.10 వేల వరకు ధర కల్పించి ఆదుకోవాలని మండల రైతులు కోరుతున్నారు.

నష్టపోతున్నాం



క్వింటాల్ రూ.10 వేల ధర వస్తుందని 40 క్వింటాళ్ల పత్తి ఇంట్లో నిల్వ చేశాను. పత్తి తీసినప్పుడు అప్పుడు రూ.9 వేలు ఉంది. అప్పుడు అమ్మక ధర పెరుగుతందని ఆశతో నిల్వ చేస్తే నష్టపోతున్నాం. పత్తికి రూ.10 వేల ధర పెంచి ఆదుకోవాలి.

– తుమ్మిడె రామన్న, రైతు, దహెగాం

తక్కువ ధరకు అమ్ముకున్నా



వానాకాలం పండిన పత్తికి ధర లేదు. 30 క్వింటాళ్ల పత్తి తక్కువ ధరకు అమ్ముకున్నాను. రూ.60 వేలు నష్టపోయాం. వానల్లో పంటకు, తీసిన పత్తికి ధర రాక ఆర్థికంగా నష్టపోయాం. పంట సాగుకు చేసిన అప్పులు తీర్చడానికి అమ్ముకున్నాను.

– దాసరి భీమయ్య రైతు, దహెగాం

విద్యార్థులు ఉన్నతంగా ఎదగాలి

- ఐటీడీఏ డీడీ మణెమ్మ



మాట్లాడుతున్న మణెమ్మ

కెరమెరి: కుమురం భీం పోరాటం చేసిన పవిత్రమైన ప్రాంతంలో చదువుతున్న మీరు ఉన్నతంగా ఎదగాలని ఐటీడీఏ డెప్యూటీ డైరెక్టర్(డీడీ) మణెమ్మ అన్నారు. బుధవారం జోడేఘాట్‌లోని కుమురం భీం మ్యూజియంలో జోడేఘాట్ ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవానికి ముఖ్యఅతిథిగా హాజరై ఆమె మాట్లాడారు. ఆదిమ గిరిజనుల కోసం ప్రత్యేకంగా జోడేఘాట్, బాబేఝరిలో సాటిలైట్ ఆశ్రమ పాఠశాలలను నెలకొల్పినట్లు తెలిపారు. విద్యార్థుల్లో దాగి ఉన్న నృత్య కళలను వెలికితీసేందుకు ఇన్‌చార్జి పీవో వరుణ్‌రెడ్డి జిల్లాలో 46 ఆశ్రమ పాఠశాలల్లో వార్షికోత్సవ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆదేశించారన్నారు. పాఠశాల హెచ్‌ఎం మోతిరాం 40 మంది బడిబయట విద్యార్థులను పాఠశాలలో చేర్పించడం సంతోషాన్ని కలిగించిందన్నారు. పీటీజీ విద్యార్థులు ఆంగ్లంలో స్పీచ్ ఇవ్వడం ఆనందాన్నిందన్నారు. చేపట్టిన కార్యక్రమం పట్ల టీచర్లను అభినందించారు. అంతకు ముందు భీం విగ్రహానికి పూలమల వేశారు, సమాధిపై పూలు చల్లారు. ఈ కార్యక్రమంలో బీసీడీవో శకుంతల, ఏటీడీఏ పురుషోత్తం, సర్పంచ్ సోనిబాయి, జోడేఘాట్, బాబేఝరి, హట్టి, రాసిమెట్ట హెచ్‌ఎంలు మోతిరాం, జంగు, ప్రేందాస్, శంకర్, ఉపాధ్యాయులు మోతిరాం, సీఆర్టీలు శ్రీనివాస్, మోహన్, ప్రఫుల్‌కుమార్, గంగాప్రసాద్, మ్యూజియం క్యూరేటర్ దుందేరావు, గ్రామపెద్ద రాజేశ్వర్ ఉన్నారు.

ఝూలూర్..ఝూలూర్ ఝుడి బోనా..!

కెరమెరి: ఝూలూర్..ఝూలూర్ ఝుడి బోనా యాదాదా అంటూ.. సాగే గోండి పాటలపై జోడేఘాట్ విద్యార్థులు చేసిన నృత్యాలు ఆహుతులను అలరించారు. మండలంలోని జోడేఘాట్‌లో భీం మ్యూజియంలో కొనసాగిన అక్కడి ఆశ్రమ పాఠశాల వార్షికోత్సవం బుధవారం ఆద్యంతంగా సాగింది. అక్కడున్న విద్యార్థులు తెలుగు, హిందీ, గోండా భాషల సుమారు 25 పాటలపై నృత్యాలు చేశారు. భరత నాట్యం, దేశభక్తి పాటలు, గోండి ఫోక్ సాంగ్స్‌లో అదరగొట్టేశారు. బాలురు బాలిక వేషధారణలో ఆకట్టుకున్నారు. జోడేఘాట్ చరిత్రలో ఇంతటి ఉత్సాహ భరిత కార్యక్రమం జరగడం ఇదే తొలిసారి కావడం విశేషం. హెచ్‌ఎం మోతిరాం, ఉపాధ్యాయులు మోతిరాం, సీఆర్టీలు శ్రీనివాస్, మోహన్, ప్రఫుల్‌కుమార్, గంగాప్రసాద్ తదితరులు ఉన్నారు.



దేశభక్తి గీతంపై నృత్యం చేస్తున్న విద్యార్థులు

కొనసాగుతున్న వీవోఏల సమ్మె



సిర్పూర్(టి): సమ్మె చేస్తున్న వీవోఏలు



బెజ్జూర్: మద్దతు తెలుపుతున్న హరీశ్‌బాబు

సిర్పూర్(టి)/కెరమెరి/బెజ్జూర్/కౌటాల/వాంకిడి: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం అమలు, సెర్ప్ ఉద్యోగులు గుర్తించాలని తదితర డిమాండ్లు ప్రభుత్వం నెరవేర్చాలని ఐకేపీలో పనిచేస్తున్న వీవోఏలు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సిర్పూర్(టి), కెరమెరి, బెజ్జూర్, కౌటాలలో సమ్మె బుధవారానికి మూడో రోజుకు చేరింది. బెజ్జూర్‌లో సమ్మెకు బీజేపీ సిర్పూర్ నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు మద్దతు తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వీవోఏలు కౌటాలలో టీజీబీ మేనేజర్ నరసింహస్వామి, ఫీల్డ్ ఆఫీసర్ మనోహర్‌కు, వాంకిడిలో ఎంపీపీ ముండె విమలబాయికి వినతిపత్రం అందించారు. వీవోఏల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎల్ములే దత్తు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మె శిబిరంలో ఉద్యమ తరగతులు

కాగజ్‌నగర్‌టౌన్: సమ్మె చేపడుతున్న కాగజ్‌నగర్ ఐకేపీ వీవోఏల సమ్మె శిబిరంలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమ తరగతులు నిర్వహించారు. అందులో భాగంగా 'పోరాటం నేర్పిస్తున్న శ్రామిక వర్గ సంస్కృతిని అలవర్చుకుందాం' అనే అంశంపై ఉద్యోగ సంఘాల సమన్వయ సమితి జిల్లా కన్వీనర్ రాజేశం ప్రసంగించి ఉద్యోగులను చైతన్యపరిచారు.

'కంటి వెలుగు' సద్వినియోగం చేసుకోవాలి



కంటి పరీక్షలను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ సంతోష్

రెబ్బెన: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జెడ్పీటీసీ వేముర్ల సంతోష్, పులికుంట సర్పంచ్ బుర్స పోషమల్లు కోరారు. బుధవారం రోడ్ పులికుంట ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పులికుంట పంచాయతీలో మూడు రోజులు కంటి వెలుగు కార్యక్రమం ఉంటుందన్నారు. రోగులకు వైద్యసిబ్బంది కంటి పరీక్షలు నిర్వహించి అవసరం ఉన్నవారికి కళ్లద్దాలు అందిస్తారని తెలిపారు. మొదటి రోజు 116 మంది వైద్య శిబిరానికి హాజరుకాగా, అవసరమైన వారికి మందులు, కళ్లద్దాలు అందజేశారు. ఎంపీడీవో శ్రీనివాస్, డాక్టర్ రాకేశ్, పంచాయతీ కార్యదర్శి సరిత, వార్డు సభ్యులు ధనలక్ష్మి, శంకర్, నాయకులు భీమయ్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

పునరావాసంలో సౌకర్యాలేవి?

వారంతా పేద ప్రజలు.. పునరావాసం కల్పిస్తే సుఖంగా ఉందామనుకున్న వారి ఆశలు ఆడియాసలవుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా నేటికీ నూతన ప్రాంతంలో వారిని చేర్పించలేదు.. స్థలం ఎంపిక చేశారు. ప్లాట్లు తీశారు. మురుగుకాల్వలు, మంచినీటి ట్యాంకు నిర్మించారు. ఇతర సౌకర్యాలేమి కల్పించకపోవడంతో ప్రస్తుతం ఉన్న ఊర్లో అభివృద్ధి జరగక ఇబ్బంది పడుతున్నారు.

- ఏళ్లు గడుస్తున్నా కానరాని వసతులు
- ఇబ్బంది పడుతున్న దేవుడ్‌పల్లి వాసులు



దేవుడ్‌పల్లి గ్రామం

కెరమెరి: కుమురం భీం ప్రాజెక్టులో ముంపునకు గురవుతుందో అప్పుడే అన్ని సౌకర్యాలతో నూతనంగా ఏర్పాటు చేసిన పునరావాసంలో వారిని చేర్పించాల్సి ఉంది. కాని అధికారుల నిర్లక్ష్యం, పాలకుల అలసత్వం వెరిసి వారిని ఇబ్బందుల్లో నెట్టివేసింది. మండలంలోని ఇందాపూర్ గ్రామ పంచాయతీలోని దేవుడ్‌పల్లి గ్రామం కుమురం భీం ప్రాజెక్టులో ముంపునకు గురైంది. మొత్తం 70 కుటుంబాలు ఉండగా.. 210 జనాభా ఉంది. ప్రస్తుతమున్న గ్రామానికి 2 కి.మీ దూరంలో 2011లో పునరావాసం కోసం స్థలాన్ని ఎంపిక చేసి అక్కడ 110 ప్లాట్లను తీశారు. ఆ స్థలంలో మురుగుకాల్వలు సైతం నిర్మించారు. మంచినీటి ట్యాంకు ఏర్పాటు చేశారు. కాని ఇంతవరకు ప్లాట్లను కేటాయించలేదు. ఇతర నిర్మాణాలకు నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వ నిర్లక్ష్యం వ్యవహరిస్తోంది.

కానరాని సౌకర్యాలు..

దేవుడ్‌పల్లి నుంచి ప్లాట్ల స్థలం వరకు సీసీ రోడ్డు సైతం నిర్మించారు. కాని విద్యుత్, తాగునీటి సౌకర్యం, పాఠశాల, అంగన్‌వాడీ భవనాలు ఇంకా ఇతర నిర్మాణం చేపట్టలేదు. దీంతో ప్రజలు అక్కడికే వెళ్దామన్నా వెళ్లలేని పరిస్థితి. మూడేళ్ల క్రితం వరకు జిల్లా కలెక్టర్లు పునరావాస కేంద్రాన్ని పరిశీలించి వారం రోజుల్లో షిఫ్ట్ చేస్తామన్నారు. కాని నేటికి కార్యరూపం దాల్చలేదు. దీంతో ప్రస్తుతం ఉన్న ప్రాంతంలో వారు నివసించడం గండంగా మారింది. కేబీ ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రస్తుతమున్న గ్రామానికి అతి సమీపంలో రావడంతో పాములు, తేళ్లు తరచూ వస్తున్నాయని గ్రామస్తులు వాపోతున్నారు. అంతేకాకుండా పునరావాసంలో ముంపునకు గురవుతుందని అభివృద్ధి పూర్తిగా నిలిచిపోయింది. గ్రౌండ్ వాటర్ అధికంగా కావడంతో ప్రస్తుతం తాగునీరు కూడా బాగుండడం లేదని ప్రజలు చెబుతున్నారు.



మంచినీటి ట్యాంకు

స్పందించాలి



దేవుడ్‌పల్లిలో ఎలాంటి సౌకర్యాలు కల్పించడం లేదు. మురుగుకాల్వలు లేవు. ముంపునకు గురైన గ్రామంగా భావించి ప్రస్తుతం ఇక్కడ నిధులు నిలిపివేశారు. దీంతో సౌకర్యాలు కల్పించడం లేదు. అధికారులు స్పందించాలి.

– సెంద్రి కమీనాబాయి, గృహిణి

సౌకర్యాలు కల్పించాలి



పునరావాస కేంద్రంలో విద్యుత్, అంతర్గత రోడ్లు, మంచినీటి సౌకర్యం కల్పించాలి. పాఠశాల, అంగన్‌వాడీ భవనం నిర్మించాలి. కాని ఇంత వరకు ఏ పనులు చేపట్టడం లేదు. ఇంతవరకు మాకు ప్లాట్లను చూపించలేదు.

– జాడి బురు, రైతు

భీం స్ఫూర్తితో ముందుకు సాగాలి



పూజలు నిర్వహిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

బెజ్జూర్: కుమురం భీం స్ఫూర్తితో ప్రతిఒక్కరూ ముందుకు సాగాలని బీఆర్‌ఎస్ నాయకులు పేర్కొన్నారు. మండలంలోని ముంజంపల్లి గ్రామంలో కుమురంభీం విగ్రహ ఆవిష్కరణ వార్షికోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి భీంకు నివాళులర్పించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమురం మాంతయ్య, జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, సహకార సంఘం మాజీ చైర్మన్ డోకే వెంకన్న, సహకార సంఘం చైర్మన్ కుర్సింగ ఓంప్రకాశ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, సర్పంచ్ చాపిలే కళావతి సత్యన్న, ఉపసర్పంచ్ అశోక్, ఆదివాసీ సంఘం సభ్యులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయం

బెజ్జూర్: అన్నివర్గాల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతుందని జెడ్పీటీసీ పంద్రం పుష్పలత అన్నారు. పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని ప్రభుత్వం పేద ముస్లింల కోసం రంజాన్ కిట్లు సరఫరా చేయగా బుధవారం పార్టీ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. సర్పంచ్ శారద, ఎంపీటీసీ పర్వీన్ సుల్తానా, ఉప సర్పంచ్ రాజేశ్, సహకార సంఘం మాజీ చైర్మన్ వెంకన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, పార్టీ యూత్ అధ్యక్షుడు నరేందర్ పాల్గొన్నారు.

పంచాయతీ స్థాయి క్రికెట్ పోటీలు ప్రారంభం

కుకుడ గ్రామంలో కోనేరు యువసేన గ్రామ పంచాయతీ స్థాయి క్రికెట్ పోటీలను జెడ్పీటీసీ పంద్రం పుష్పలత ప్రారంభించారు. సహకార సంఘం మాజీ చైర్మన్ డోకే వెంకన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు సిడాం సకారాం, సర్పంచ్ ఆసియా బాను రహెమత్, నాయకులు ఇంజిరి రాజారామ్, సిడాం పురుషోత్తం, పెద్దల కైలాశ్ పాల్గొన్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కౌటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమని బీజేపీ నియోజకవర్గ నాయకుడు పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. మండలంలోని వీరవెల్లి గ్రామంలో ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా పోటీల్లో గెలుపొందిన ముత్తంపేట జట్టుకు రూ. 25 వేలు నగదుతోపాటు బహుమతులు అందించగా వీరవెల్లి జట్టుకు రూ.15 వేలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల యువకుల్లో క్రీడా నైపుణ్యాలు ఉన్నాయని, వాటిని వెలికితీసేందుకు క్రీడా పోటీలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఎల్ములే కొండయ్య, నాయకులు ఎల్ములే శంకర్, బి.సాయి, బాలాజీ, నిర్వాహకులు పాల్గొన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలి



సంతకాల సేకరణకు మద్దతు తెలుపుతున్న రాజకీయ పార్టీల నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లావ్యాప్తంగా పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ ప్రభుత్వం వెంటనే ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లోకేశ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట తెలంగాణ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు గణపురం మహేశ్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు సురేందర్ అధ్యక్షతన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల మంజూరుకు బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. రాజకీయ పార్టీల నాయకులు హాజరై మద్దతు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మహేష్ మాట్లాడుతూ జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులతో సంబంధం లేకుండా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలన్నారు. రెండో విడత అక్రిడిటేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ వేగవంతం చేయాలన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు రవి, కృష్ణ మోహన్‌గౌడ్, ఆసీఫ్, బాలాజీ, ధనంజయ్, ప్రకాశ్, అశోక్‌గౌడ్, ఖలీల్, లలిత, వెంకటేశ్, శివ, మోయిన్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యానికి బానిస కావొద్దు

బెజ్జూర్: యువత మద్యానికి బానిస కావొద్దని బెజ్జూర్ ఎస్సై వెంకటేశ్ అన్నారు. మండలంలోని చిన్నసిద్దాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి కళాజాత ప్రదర్శన నిర్వహించారు. తాగుడుకు బానిస అయితే జరిగే నష్టాల గురించి ఈ సందర్భంగా కళాకారులు పాటల రూపంలో కళ్లకు కట్టినట్లుగా గ్రామస్తులకు వివరించారు. కళా బృందం సభ్యులు రాజలింగు, శంకర్, రోహిత్ పాల్గొన్నారు.

అంబలి పంపిణీ

సిర్పూర్(టి): వేంపల్లి పంచాయతీ పరిధిలో వైస్ ఎంపీపీ ఈర్త సత్యనారాయణ ఆధ్వర్యంలో ఉచితంగా అంబలి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వేసవిలో ప్రజలు, ప్రయాణికులు ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు బుధవారం అంబలి పంపిణీ చేశారు.

ప్రిన్సిపాల్‌కు సన్మానం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మి నరసింహం కాకతీయ విశ్వ విద్యాలయం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ పట్టా పొందారు. ఈ సందర్భంగా ఆయన్ను కళాశాలలో అధ్యాపకులు బుధవారం సన్మానించారు. ప్రిన్సిపాల్ డాక్టరేట్ పట్టా పొందడం గర్వించదగ్గ విషయమని వారు హర్షం వ్యక్తం చేశారు.

సన్మానం

ఆసిఫాబాద్: కైరిగూడ ఓపెన్‌కాస్టు కార్మికుల ఉద్యోగ భద్రత కోసం ఉద్యమించి అరెస్టయిన బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు ఆత్మారాం నాయక్ 11 రోజుల అనంతరం జైలు నుంచి విడుదలయ్యారు. జిల్లా కేంద్రంలో ఎస్సీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్య ప్రకాశ్, జిల్లా ఉపాధ్యక్షుడు జయరాజ్ మాటూరి ఆధ్వర్యంలో బుధవారం ఆయన్ను సన్మానించారు. నాయకులు బోనగిరి సతీశ్‌బాబు, ఖాండ్రే విశాల్, ఈదులవాడ గణేశ్ పాల్గొన్నారు.